AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAYNEWS.COM

19-10-2026 (Monday) MAIN EDITION

హైదరాబాద్‌లో భారీ అగ్ని ప్రమాదం



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : హైదరాబాద్ నగరంలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. చార్మినార్ సమీపంలో మదీనా రోడ్డులో ఉన్న బాంబే హోసియరీలో సోమవారం ఉదయం మంటలు చెలరేగాయి. బట్టల దుకాణంలో మంటలు వ్యాపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. నాలుగు ఫైరింజన్లు ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి వేశాయి.

ఎయిర్‌టెల్ నుంచి వాయిస్ ప్లాన్లు..




అక్షరటుడే, బిజినెస్ డెస్క్: టెలికాం రంగ దిగ్గజ కంపెనీ భారతీ ఎయిర్‌టెల్ తన వినియోగదారులకోసం కొత్త ప్రీపెయిడ్ రీచార్జ్ ప్లాన్లను ప్రవేశ పెట్టింది. కేవలం ఫోన్ మాట్లాడుకునే వారి కోసం రూ.185, రూ.203, రూ.206 ధరలతో వీటిని తీసుకువచ్చింది. మొబైల్ డాటా అవసరం లేనివారికి ఇవి ప్రయోజకరంగా ఉండనున్నాయి.

ప్రాణహిత నీటిని మళ్లించాలి : కవిత



అక్షరటుడే, భూపాలపల్లి : కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన కన్నేపల్లి పంపు హౌస్ వద్ద ప్రాణహిత ప్రవాహాన్ని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సోమవారం పరిశీలించారు. కాపర్ డ్యామ్ నిర్మించి ప్రాణహిత నీటిని మళ్లించాలని ఆమె డిమాండ్ చేశారు. మేడిగడ్డను బూచిగా చూపి రైతులకు నష్టం చేయొద్దన్నారు.

వారణాసి హైవేపై లారీ బీభత్సం




అక్షరటుడే, యూపీ : ప్రయాగ్‌రాజ్-వారణాసి జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున భయానక ప్రమాదం జరిగింది. రోడ్డు పక్కన నిలిపివున్న స్కార్పియో కారును వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ఘోర దుర్ఘటనలో నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు.

సీజేపీ నేతల బెయిల్ విచారణ.. మెజిస్ట్రేట్‌కు బెదిరింపులు



అక్షరటుడే, ఢిల్లీ : సీజేపీ నేతలు అశుతోష్ రంకా , సొరవ్ దాస్ బెయిల్ పిటిషన్‌పై విచారణ జరుగుతున్న సమయంలో స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్‌కు హత్య బెదిరింపులు రావడం ఢిల్లీలో తీవ్ర కలకలం రేపింది. మెజిస్ట్రేట్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఢిల్లీ పోలీసులు అపరిచిత వ్యక్తులపై నాన్-కాగ్నిజబుల్ రిపోర్ట్ నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు.

హైదరాబాద్‌లో భారీగా ఎస్సైల బదిలీ



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో భారీగా ఎస్సైలను బదిలీ చేస్తూ నగర కమిషనర్ వీసీ సజ్జనార్ ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 75 మందికి స్థానచలనం కలిగించారు. నగరంలో ఇటీవల 16 మంది సీఐలను ట్రాన్స్‌ఫర్ చేసిన సీపీ.. తాజాగా 75 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేశారు. వివిధ పోలీస్ స్టేషన్లు, స్పెషల్ విభాగాల్లో పనిచేస్తున్న 75 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లను ఉత్తర్వులు జారీ చేశారు. నగరం అంతటా పోలీసింగ్ వ్యవస్థను బలోపేతం చేయడం, శాంతిభద్రతల నిర్వహణను మెరుగుపరచడమే లక్ష్యంగా బదిలీలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

టైగర్ ష్రాఫ్‌పై కాల్పులు..



ముంబైలో నటుడు టైగర్ ష్రాఫ్‌పై జరిగిన కాల్పుల ఘటనలో ముగ్గురు నిందితులను కోటా పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరు హర్యానా వాసులు కాగా, ఒకరు బీహార్ వాసి. కోటా నగర పోలీసు బృందం వారిని రైలులో పట్టుకుందని కోటా ఎస్పీ తేజస్వని గౌతమ్ తెలిపారు. నిందితుల్లో ఇద్దరు కిరాయి హంతకులు కాగా, మూడవ వ్యక్తి దాడి తర్వాత వారు తప్పించుకోవడానికి సహాయం చేసినట్లు అనుమానిస్తున్నారు.

- అక్షరటుడే, నేషనల్ డెస్క్

నిందితుల అరెస్ట్

■ రాజస్థాన్‌లో ముగ్గురి పట్టివేత ■ రైలులో అదుపులోకి తీసుకున్న పోలీసులు ■ కొనసాగుతున్న విచారణ

ముంబైలోని జుహు ప్రాంతంలో నటుడు టైగర్ ష్రాఫ్‌పై ఆదివారం సాయంత్రం కాల్పులు జరిగిన విషయం తెలిసిందే. సుమారు 7 గంటల ప్రాంతంలో ఆయన ఫుట్‌బాల్ క్లబ్ నుంచి కారులో బయలుదేరుతుండగా, గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఆయన డ్రైవర్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. కారు అద్దలు గుచ్చుకోవడంతో నటుడు సైతం స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటనను సీరియస్ తీసుకున్న ముంబై పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలించారు. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించారు.

ర్యాపిడో డ్రైవర్‌గా..

నిందితుల్లో ఒకరు హర్యానాలోని సోనిపట్‌కు చెందిన 17 ఏళ్ల మైనర్. మిగిలిన ఇద్దరిని బీహార్‌లోని బెగుసరాయ్‌కు చెందిన 22 ఏళ్ల హృతిక్ కుమార్ అలియాస్ రోషన్. ఇతను ప్రస్తుతం ముంబైలోని అంధేరీ వెస్ట్‌లో నివసిస్తూ 'రాపిడో' రైడర్‌గా పనిచేస్తున్నాడు. మరో వ్యక్తి హర్యానాలోని సోనిపట్‌కు చెందిన 18 ఏళ్ల రెహాన్ అని గుర్తించారు.

పక్కా సమాచారం మేరకు..

నిందితులు రైలులో రాజస్థాన్‌కు పారిపోతున్నారనే సమాచారం మేరకు ముంబై పోలీసులు ఇచ్చిన ఇన్‌ఫర్మేషన్ ఆధారంగా రాజస్థాన్ యాంటీగ్యాంగ్‌స్టర్ టాస్క్ ఫోర్స్, కోటా పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరు పూణేజైపూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తుండగా పట్టుబడ్డారు. నిందితులు శిక్షణ పొందిన హంతకులని, దాడి కోసం ముందే రెక్కీ నిర్వహించారని పోలీసులు తెలిపారు. కాల్పుల అనంతరం నిందితులు ఎస్వీ రోడ్ మీదుగా పారిపోయారు.

ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ అల్గారిథమ్‌లను మార్చాల్సిందే: కేంద్రం



అక్షరటుడే, నేషనల్ డెస్క్: ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా నకిలీ సమాచారం వ్యాప్తి చెందకుండా, ప్రజా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలకు శ్రీకారం చుట్టింది. సోషల్ మీడియా దిగ్గజం మెటా సంస్థకు ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ అధికారికంగా ఒక పటిష్టమైన అడ్వైజరీని జారీ చేసింది. ప్లాట్‌ఫారమ్‌లలోని సిఫార్సు వ్యవస్థలు, కంటెంట్ర్యాంకింగ్ అల్గారిథమ్‌ల పనితీరును తక్షణమే పునఃపరిశీలించాలని స్పష్టం చేసింది.

నిందితులను వదిలిపెట్టమన్న మహా రాష్ట్ర సీఎం



అక్షరటుడే, మహారాష్ట్ర : బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్‌పై జరిగిన హత్యాయత్నాన్ని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ తీవ్రంగా ఖండించారు. ముంబై పోలీసులు ఈ కాల్పుల ఘటనను అత్యంత తీవ్రంగా పరిగణించారని చెప్పారు. ఇప్పటికే కొంతమందిని గుర్తించినట్లు తెలిపారు. టైగర్ ష్రాఫ్‌పై జరిగిన ఈ కాల్పుల ఘటనలో నిందితులు ఎవరైనా వదిలిపెట్టమని స్పష్టం చేశారు. సోమవారం ఉదయం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ పని చేసింది ముఠా కావచ్చు, వ్యక్తి కావచ్చు ఎవరినీ వదిలిపెట్టబోమని, వారు ఎక్కడ దాక్కున్నా ముంబై పోలీసులు వారిని పట్టుకుంటారని తెలిపారు. ఇలాంటి బెదిరింపులకు పాల్పడితే, ఎలా దారిలోకి తీసుకురావాలో ముంబై పోలీసులకు బాగా తెలున్నారు.

వీవోనుంచి అద్భుతమైన ఫోన్



అక్షరటుడే, ఫీచర్‌డెస్క్: ప్రముఖ స్మార్ట్ ఫోన్ల తయారీ కంపెనీ అయిన వీవో.. భారత మార్కెట్‌లో మరో మోడల్ స్మార్ట్ ఫోన్‌ను రిలీజ్ చేసింది. వీవో ఎస్ 2 ఎఫ్ఈ పేరుతో తీసుకువచ్చిన ఈ ఫోన్‌లో మీడియాటెక్ డైమెన్సిటీ 7300 ప్రాసెసర్ అమర్చారు. ఇది ఆండ్రాయిడ్ 16 ఆధారిత ఆపరేటింగ్ సిస్టమ్‌తో పనిచేస్తుంది. 10,000 ఎంఏహెచ్ సామర్థ్యం గల బ్యాటరీ ఉంది. ఈ ఫోన్ విక్రయాలు అక్టోబర్ 20 నుంచి ప్రారంభం కానున్నాయి. కంపెనీ అధికారిక వెబ్‌సైట్ తోపాటు అమెజాన్‌లో అందుబాటులో ఉండనుంది. మూడు వేరియంట్లలో ఫోన్ లభించనుంది.

ఎఫ్ఐఐలు తిరిగొచ్చేదెప్పుడో?..



అక్షరటుడే, బిజినెస్ డెస్క్: దేశయ స్టాక్ మార్కెట్ నుంచి విదేశీ పెట్టుబడిదారుల అమ్మకాల ప్రవాహం నిరంతరాయంగా కొనసాగుతూనే ఉంది. ఈనెలలో ఇప్పటికే నికరంగా రూ. 48 వేల కోట్లకుపైగా స్టాక్స్ విక్రయించారు. సెప్టెంబర్‌లో రూ. 44,012 కోట్ల పెట్టుబడులు వెనక్కి తీసుకున్నారు. గతనెలలో విక్రయించిన మొత్తాన్ని ఎఫ్ఐఐలు ఈ నెలలో ఇప్పటికే దాటడం గమనార్హం. విదేశీ సంస్థాగత మదుపరులు భారత్‌నుంచి ఆరేళ్లుగా పెట్టుబడులు వెనక్కి తీసుకువెళ్తూనే ఉన్నారు. చివరిసారిగా కోవిడ్ ఇయర్ 2020లో నికర కొనుగోలుదారులుగా ఉన్నారు. ఆ సంవత్సరం దేశీయ స్టాక్ మార్కెట్‌లో నికరంగా రూ. 64,379 కోట్ల పెట్టుబడులు పెట్టారు. 2021 నుంచి అమ్మకాలు ప్రారంభమయ్యాయి.

కోనేరులోకి దూసుకెళ్లిన కారు..



అక్షరటుడే, రంగారెడ్డి : రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలోని శ్రీ శివగంగ రాజరాజేశ్వర స్వామి ఆలయ కోనేరులోకి ఇన్నోవా కారు దూసుకెళ్లింది. ఆలయ ఆవరణలో ఆదివారం రాత్రి బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కోనేరులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. అనంతరం కొద్దిసేపటికే ఓ కారు నీటిలోకి దూసుకెళ్లింది. అతివేగంగా వచ్చిన కారు.. అదుపు తప్పడంతో ప్రమాదం చోటు చేసుకుంది. కారులో డ్రైవర్ ఒక్కడే ఉండగా, అతను సురక్షితంగా బయటపడ్డాడు. బతుకమ్మల నిమజ్జన సమయంలో కారు దూసుకెళ్లి ఉంటే పరిస్థితి తీవ్రంగా ఉండేదని స్థానికులు పేర్కొన్నారు.

రూ.4 కోట్ల విలువైన బంగారం పట్టివేత



అక్షరటుడే, ఢిల్లీ : ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో సోమవారం ఉదయం డీఆర్ఐ అధికారులు రూ.4 కోట్ల విలువైన బంగారం సీజ్ చేశారు. దుబాయ్ నుంచి వచ్చిన ఒక భారతీయ ప్రయాణికుడిని కస్టమ్స్ అధికారులు తనిఖీ చేశారు. అతడి బ్యాగేజీలోని ఫ్లోర్ స్ప్రింగ్‌లు అనుమానాస్పదంగా కనిపించడంతో ఓపెన్ చేసి చూశారు. అందులో 3.2 కిలోల బంగారు కడ్డీలను స్వాధీనం చేసుకున్నారు. ఆ బంగారం విలువ రూ.4.03 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేశారు. కస్టమ్స్ చట్టం, 1962 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు



అక్షరటుడే, రంగారెడ్డి : ఆర్టీసీ బస్సు ఆగి ఉన్న లారీని ఢీకొంది. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాటసింగారం గ్రామం సమీపంలో సోమవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. ఖమ్మం నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు లారీని ఢీకొంది. దీంతో అందులోని 15 మంది ప్రయాణికులకు గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం వనస్థలిపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు.